క్లుప్తంగా...

తరగతి గదుల సముదాయం ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని బీఈడీ కాలేజీలో రూ.7.5 కోట్ల వ్యయంతో నిర్మించిన తరగతి గదుల సముదాయాన్ని మంగళవారం వీసీ ప్రొ.రవీందర్ ప్రారంభించారు. పండిట్ మదన్ మోహన్ మాలవ్య జాతీయ మిషన్‌లో భాగంగా 2015–20 ప్రణాళికలో కేంద్ర ప్రభుత్వం ఎడ్యుకేషన్ తరగతి గదుల నిర్మాణానికి అందించిన రూ.7.5 కోట్ల నిధులతో గదుల భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, హెడ్ ప్రొ.మృణాళిని, ప్రిన్సిపల్ రవీంద్రనాథ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రొ. ఐలయ్య పరిశోధనకు పేటెంట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ కాలేజీ ఆఫ్ టెక్నాలజీ కెమికల్ ఇంజినీర్ అధ్యాపకులు ప్రొ.సాదం ఐలయ్య పరిశోధనకు పేటెంట్ లభించింది. తాను డిజైన్ చేసిన కెమికల్ అడల్ట్రేషన్స్ టెస్టింగ్ డివైస్‌కు ఇండియన్ పేటెంట్ దక్కింది. ఓయూ వీసీ, రిజిస్ట్రార్‌తో పాటు కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

బీజేపీ గెలుపే లక్ష్యం

లాలాపేట: బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన సభకు మహంకాళి సికింద్రాబాద్ జిల్లాకు చెందిన ఎస్సీ మోర్చా నాయకులు తరలివెళ్లారు. అంతకంటే ముందు నేతలు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల నాటికి బీజేపీ బలోపేతానికి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్రావు, హంసరాజు, నవీన్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఫౌండేషన్‌కు చేయూత



రసూల్‌పురా: కంటోన్మెంట్ కార్ఖాన జనక్‌పురి కాలనీలోని ఆర్‌కే. మదర్ థెరిస్సా ఫౌండేషన్‌కు రాష్ట్ర బెవరేజెష్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ మంగళవారం రూ.7.20 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నాగేష్ మాట్లాడుతూ.. నిస్వార్థంగా డాక్టర్ రామకృష్ణ ఫౌండేషన్ ఏర్పాటు చేసి వృద్ధులకు సేవలందిస్తున్నారని ఫౌండేషన్‌లో ఉంటున్న వృద్ధుల ఆరోగ్య సంరక్షణ, ఇతర మౌలిక వసతులను కల్పించేందుకు తన వంతుగా సాయం చేశానన్నారు. వృద్ధులకు చేయూతనందించేందుకు గజ్జెల నాగేష్ ఆర్థిక సాయం చేయడం హర్షణీయమని డాక్టర్ రామకృష్ణ తెలిపారు.

పీస్ కమిటీ సమావేశం

బౌద్ధనగర్: భక్తిశ్రద్ధలు, శాంతియుతంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలు జరుపుకోవాలని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ సారి వినాయక చవితి నిమజ్జనం రోజు (28)న మిలాద్–ఉన్–నబీ ఉండడంతో అందరూ సహకరించాలన్నారు. ర్యాలీలు తీయాలనుకునే వారు ఉదయం నిర్వహించే విధంగా చూడాలని ముస్లిం మత పెద్దలను కోరారు. అన్నదానాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తే ముందుగానే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సీఐ శంకర్, ఎస్‌ఐలు సునీత, అజీజ్, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

'విమోచన దినోత్సవాల నిర్వహణలో విఫలం'

సికింద్రాబాద్: రాష్ట్రం ఏర్పాటయ్యాక తెలంగాణ విమోచన దినోత్సవాలు నిర్వహిస్తామని ప్రకటించిన బీఆర్‌ఎస్ నేతలు అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలను మోసం చేశారని సికింద్రాబాద్ బీజేపీ నాయకులు విమర్శించారు. మంగళవారం నామాలగుండు బీఎస్‌ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చినా విమోచన దినోత్సవాలు నిర్వహించడంలో పాలకులు మాట తప్పారన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు, ఆ తరువాత ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపే సమయం ఆసన్నం అయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా కేంద్రమంత్రి జీ.కిషన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 13 నుంచి నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాల్లో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేకల సారంగపాణి, బండా కార్తీకారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ఆదం విజయ్‌కుమార్, పి.రవిప్రసాద్‌గౌడ్, ప్రభుగుప్తా, కనకట్ల హరి, కన్నాభిరామ్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన

రాంగోపాల్‌పేట్: బేగంపేట డివిజన్‌లోని పాటిగడ్డ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ మహేశ్వరి పరిశీలించి పనులపై ఆరా తీశారు. త్వరలోనే పనులు పూర్తవుతాయని ఈ సందర్భంగా అధికారులు కార్పొరేటర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ ముదిరాజ్, అక్బర్, అఖిల్ అహ్మద్ పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. వెల వెల

- ఆధ్వానంగా మారిన జయశంకర్ స్టేడియం
- ధ్వంసమైన క్రీడాసామగ్రి
- అసాంఘిక కార్యక్రమాలకు అండగా మారిన వైనం
- వినియోగంలోకి తేవాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు



లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియం



స్టేడియంలోపల మూసి ఉన్న వెయిట్ లిఫ్టింగ్ గది

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధి లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం లాంటిది ఇంకోటి లేదు. అవుట్‌డోర్ గేమ్స్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, యోగా, జిమ్ వంటి ఇండోర్ గేమ్స్ సదుపాయాలతో ఏర్పాటు చేసిన స్టేడియానికి నిర్వహణ కరువై నేడు అధ్వానంగా మారింది. తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం గత కొంత కాలంగా నిర్వహణ లేక క్రీడాకారులు అటువైపు రావడం మానేశారు. సంబంధిత అధికారులు సంవత్సరానికి ఒక పర్యాయం కూడా స్టేడియం వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. దీంతో సంబంధం లేని వ్యక్తులు స్టేడియంలో తిష్టవేసి ఇష్టానుసారంగా వాడుకుంటున్నారు. ఇక ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులో సౌకర్యాలు లేక చీకటి గదిలా దర్శనమిస్తోంది. సమయపాలన లేకుండా బయటి వ్యక్తులు స్టేడియంలోకి వచ్చి మద్యం తాగడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

కనీస సౌకర్యాలు లేక..

నిత్యం క్రీడాకారులతో బిజీగా ఉండాల్సిన స్టేడియంలోని ఆయా క్రీడలకు సంబంధించిన గదులు ఎప్పుడు చూసినా తాళం వేసే ఉంటాయి. అందులోని క్రీడా సామాగ్రి ఏమయ్యిందో తెలియని పరిస్థితి నెలకొంది. కనీస సౌకర్యాలైన తాగు, వాడుక నీరు, విద్యుత్ సదుపాయం వంటివి లేక



స్టేడియంలోని టాయిలెట్‌ల దుస్థితి

క్రీడాకారులు స్టేడియంను ఉపయోగించుకోలేకపోతున్నారు. పాడైన విద్యుత్ వ్యవస్థ, నిర్వహణ లేక దుర్గంధం వెదజల్లుతున్న టాయిలెట్లు, ఊడిపోయిన కుళాయిలు, విరిగిపోయిన తలుపులు టాయిలెట్లు ధ్వంసమయ్యాయి. ఫలితంగా నేడు జీహెచ్ఎంసీ స్టోర్ రూమ్‌గా మారింది. గతంలో కంటి వెలుగు కార్యక్రమాలు, డబుల్ బెడ్రూమ్ దరఖాస్తుల స్వీకరణ వంటి ప్రభుత్వ కార్యక్రమాలకు స్టేడియం వేదికగా మారుతుంది.

- స్టేడియంలో మరో వైపు కొనసాగుతున్న స్విమ్మింగ్ పూల్ నిర్మాణం నేపథ్యంలో నిర్మాణ సామాగ్రి స్టేడియంలో ఎక్కడపడితే అక్కడ వేశారు. దీంతో ఉదయం, సాయంత్రం స్థానికులు వాకింగ్ చేసుకోలేకపోతున్నారు. స్టేడియం ఆవరణలో ఉన్న ఓపెన్ జిమ్‌లో పరికరాలు పాడైపోయాయి, కొన్ని విరిగిపోవడంతో స్థానికులు దానిని ఉపయోగించుకోలేకపోతున్నారు. ఇలా స్టేడియంలో ఎక్కడ చూసినా సమస్యలే సమస్యలు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి స్టేడియాన్ని అభివృద్ధి పరిస్తే క్రీడాకారులకు సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు, క్రీడాకారులు కోరుతున్నారు.

పేదల చెంతకు మెరుగైన వైద్య సేవలు

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



ఆరోగ్య మహిళ కేంద్రం ప్రారంభిస్తున్న తలసాని, లాస్యనందిత

రసూల్‌పురా: ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని ప్రజలకు వైద్య సేవలు చేరువ చేసేందుకే ఆరోగ్య మహిళ కేంద్రాలు, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం కంటోన్మెంట్ నియోజకవర్గం ఏడో వార్డు తిరుమలగిరిలో మహిళా ఆరోగ్య కేంద్రంతో పాటు ఐదోవార్డు సంజీవయ్యనగర్, మూడో వార్డు బాలంరాయి జైన్ భవన్‌లో రెండో వార్డు సీబీఎస్ నగర్ కమ్యూనిటీహాల్లో ఆయన డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ లాస్యనందిత, గజ్జెల నాగేష్, మర్రి రాజశేఖర్ రెడ్డి, కలెక్టర్ అనుదీప్‌తో బస్తీ దవాఖానాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు త్వరలో బొల్లారంలో 1200 పడకల ఆసుపత్రి అందుబాటులోకి తెస్తామన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని మహిళలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఆరోగ్య మహిళ పథకం ప్రారంభించారని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బోర్డు మాజీ సభ్యుడు శ్యాంకుమార్ మాట్లాడుతూ.. తిరుమలగిరిలో ఆరోగ్య మహిళ కేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమని ప్రతి మంగళవారం మహిళలకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటి, బస్తీ దవాఖానా కోఆర్డినేటర్ రుక్మారెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు గౌరిశంకర్, జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు అనిత ప్రభాకర్, నళిని కిరణ్, పాండుయాదవ్, భాగ్యశ్రీ, లోక్‌నాథ్, నాయకులు టీఎన్. శ్రీనివాస్, ముప్పిడి మధుకర్, డి. శ్రీనివాస్, నివేదిత పాల్గొన్నారు.

'పేదలకు అందని సంక్షేమ పథకాలు'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

అడ్డగుట్ట: అట్టడుగు వర్గాల ప్రజలకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందడం లేదని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. అడ్డగుట్టలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో వేలాది మంది ఇళ్లు లేని నిరుపేద ప్రజలు డబుల్ బెడ్రూమ్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటే అందులో కొంత మందికి మాత్రమే కేటాయించారన్నారు. అదే విధంగా దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు ఇప్పటివరకు ఎంతమందికి కేటాయించారో పూర్తి వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పథకాల కేటాయింపులో స్పష్టమైన విధి విధానాలు లేకుండా పారదర్శకత పాటించకుండా పైరవీకారులు, బీఆర్‌ఎస్ నాయకులకే కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఐ నేతలు పాకాల యాదగిరి, షేక్ లతీఫ్, రషీద్, శంకరయ్య, కాసిం, సంజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి..

అడ్డగుట్ట: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం బీజేపీ నైతిక బాధ్యత అని కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనకై ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో అడ్డగుట్ట డివిజన్‌లో నిర్వహిస్తున్న దీక్షకు సీపీఐ మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ నెల 18–22 వరకు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. సామ్యుల్, మల్లికార్జున్ మాట్లాడుతూ.. బీజేపీ ఏదైనా ఒక సామాజిక అంశానికి సుదీర్ఘ కాలం మద్దతుగా ఉన్నదంటే అది కేవలం ఎస్సీ వర్గీకరణకు మాత్రమే అన్నారు. ఈ దీక్షలో సోమయ్య, జగన్, ఉపేందర్, సురేష్, గౌరయ్య, కనకం కుమార్, సూజాత, మనమ్మ, కనకమ్మ, ఓదమ్మ, రేణుక పాల్గొన్నారు.

మాణికేశ్వర్‌నగర్‌లో కాంగ్రెస్ పాదయాత్ర

లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో మంగళవారం సికింద్రాబాద్ నియోజక వర్గం సీనియర్ నాయకులు నోముల ప్రకాష్‌రావు పాదయాత్ర చేశారు. బస్తీలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకుని వారు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తిరుగబడదాం బీఆర్‌ఎస్, బీజేపీలను తరిమికొడదాం అంటూ ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17న తుక్కుగూడలో నిర్వహించనున్న కాంగ్రెస్ విజయభేరీ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్‌లాల్, జగదీశ్వర్, షకీల్, వేముల శ్రీనివాస్, లాజరస్, బోదాసు నర్సింహ్మా, ఆలకుంట లింగయ్య, నర్సింహ్మా, గణేష్, ప్రవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెట్విన్ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ సంతోష్



వివరాలు తెలుసుకుంటున్న సంతోష్‌కుమార్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ సందర్శించారు. సెట్విన్ కేంద్రం సమీపంలోనే నిర్మిస్తున్న అధునాతన ఆసుపత్రి భవనం, విద్యాసంస్థల భవన నిర్మాణం పనులు పరిశీలించారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ సెట్విన్ కేంద్రంలో శిక్షణ ఇస్తున్న తీరు, సుమారు రూ.40 కోట్ల వ్యయంతో ఆసుపత్రి, విద్యా సంస్థల నిర్మాణం పనుల తీరుతెన్నులను సంతోష్‌కుమార్‌కు వివరించారు. అనంతరం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశమైన నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు, పార్టీ కార్యకలాపాల గురించి చర్చించుకున్నారు.

రైలు ప్రమాదంలో వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

అడ్డగుట్ట: రైలు ప్రమాదంలో వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. దమ్మాయిగూడకు చెందిన దాచ లక్ష్మణ్ (25) రైల్వే ఉద్యోగి. లాలాగూడ ఎస్ అండ్ టీ డిపార్ట్‌మెంట్‌లో హెల్పర్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 12న మధ్యాహ్నం 2 గంటల సమయంలో క్యావలరీ బ్యారక్ వద్ద విధులు నిర్వహిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

పట్టాలు దాటుతుండగా..

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో గుండ్ల పోచంపల్లి – బొల్లారం రైల్వే స్టేషన్ల మధ్యలోని పట్టాలపై సుమారు 35–40 ఏళ్ల మధ్య వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

మల్కాజ్‌గిరి–దయానంద్ నగర్ స్టేషన్ల మార్గ మధ్యలో..

అడ్డగుట్ట: పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మల్కాజ్‌గిరి–దయానంద్ నగర్ రైల్వే స్టేషన్ల మార్గ మధ్యలోని పట్టాలపై సోమవారం రాత్రి 11 గంటల సమయంలో సుమారు 40–45 ఏళ్ల వయస్సు గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వైపు వెళ్లే రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు తెలుపు, నలుపు రంగుల గీతలతో ఉన్న చెక్స్ ఫుల్‌షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రైలుకు ఎదురెళ్లి .

సికింద్రాబాద్: సుమారు 20 సంవత్సరాల వయసున్న యువతి సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఆర్‌కే పురం రైల్వేట్రాక్ మధ్యలోకి చేరుకుని వేగంగా వస్తున్న గూడ్స్ రైలుకి ఎదురుగా నిల్చుంది. యువతిని గుర్తించిన లోకో పైలట్ అత్యవసర బ్రేక్ వేసినప్పటికీ ఇంజిన్ ముందు భాగం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే రైల్వే పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

ద్విచక్ర వాహన దొంగ అరెస్టు

రాంగోపాల్‌పేట్: ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న దొంగను గోపాలపురం పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ మురళీధర్, అదనపు ఇన్‌స్పెక్టర్ కౌశిక్ వివరాల ప్రకారం.. సఫీల్‌గూడ భరత్‌నగర్ కాలనీకి చెందిన పిల్లి శివకుమార్ అలియాస్ బొట్టు అశోక్‌కుమార్ (40) లేబర్ పనిచేస్తుంటాడు. డబ్బులు సరిపోకపోవడంతో ద్విచక్ర వాహనాలు దొంగిలించాలని నిర్ణయించుకున్నారు. రాజేంద్రనగర్‌కు చెందిన కోటేశ్వరరావు ఈ నెల 10న తన స్నేహితుడిని తీసుకెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ద్విచక్ర వాహనం పార్కు చేసి లోపలికి వెళ్లి వచ్చేలోపు వాహనం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం గోపాలపురం డీఎస్సై వేణుగోపాల్ క్రైం పోలీసులు చిలకలగూడ చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేస్తుండగా పిల్లి శివకుమార్ దొంగిలించిన వాహనంతో తిరుగుతుండగా అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేస్తున్నట్లు అంగీకరించాడు. నగరంలోని వివిధ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అర్హుల గుర్తింపులో అధికారుల అలసత్వం

కంటోన్మెంట్: డబుల్ బెడ్రూమ్ పథకంలో అధికారుల అలసత్వంతో కంటోన్మెంట్ వాసులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఆన్‌లైన్ ద్వారా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించాల్సిన అధికారులు చేతులెత్తేశారు. కంటోన్మెంట్ పరిధిలో ఇళ్ల గుర్తింపు తమ వల్ల కావడం లేదంటూ వెరిఫికేషన్ చేయకుండా వదిలేశారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం డ్రా పద్ధతిలో నగరంలోని ఇతర నియోజకవర్గాలకు 500 చొప్పున ఇళ్లు కేటాయించగా, కంటోన్మెంట్‌కు మాత్రం 200 మాత్రమే కేటాయించారు. అదేమని పలువురు స్థానిక నేతలు ఆరా తీయగా కంటోన్మెంట్‌లో 500 మంది మాత్రమే అర్హులున్నారంటే పేర్కొనడం విడ్డూరం. కంటోన్మెంట్ విషయానికి వస్తే బోర్డు సిబ్బంది సహకారంతో కేవలం ఒకటో వార్డులో వెరిఫికేషన్ పూర్తయింది. తాజాగా నిర్వహించిన డ్రాలో ఎంపికైన 200 మంది లబ్ధిదారుల్లో 150 మంది మోండా డివిజన్, బోయిన్‌పల్లికి చెందిన వారే ఉండటం గమనార్హం. ఇదిలా ఉండగా దరఖాస్తుదారుల తనిఖీ ప్రక్రియలో బోర్డు అధికారుల సహకారం కొరవడిందంటూ బోర్డు మాజీ సభ్యులు ఆరోపిస్తూ సీఈఓను కలిసి మాట్లాడేందుకు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, లోకనాథం, నళిని, అనిత ప్రభాకర్ మంగళవారం బోర్డు కార్యాలయానికి వచ్చారు. సీఈఓ అందుబాటులో లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

ఓయూలో మరో ఉద్యోగి వీఆర్‌ఎస్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మరో ఉద్యోగి వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేశారు. గత నెల న్యాయ కళాశాల అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్‌కుమార్ వీఆర్‌ఎస్ తీసుకున్న విషయం విదితమే. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఈఎంఎంఆర్‌సీలో నాన్ టీచింగ్ ఉద్యోగి డాక్టర్ మధుసూదన్ రెడ్డి డైరెక్టర్ పోస్టు ఎంపికలో తనకు అన్యాయం జరిగిందని వీఆర్‌ఎస్ తీసుకోవాలని నిర్ణయించారు. ఈ నెల 1న జరిగిన ఇంటర్వ్యూలో అన్ని అర్హత గల ఈఎంఎంఆర్‌సీ సీనియర్ ఉద్యోగులను విస్మరించి జూనియర్లకు డైరెక్టర్ పోస్టు ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ (ఎస్‌ఈ) దేవిదాస్‌ను ఎలాంటి కారణం లేకుండా ఆరు నెలలు సస్పెండ్ చేసి ఇంత వరకు ఎలాంటి విచారణ ప్రారంభించలేదు. ఇలా ఓయూలో వివిధ కారణాలతో అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు వీసీ ప్రొ.రవీందర్ పై అసంతృప్తితో ఉన్నారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం

అడ్డగుట్ట: ప్రయాణికుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్సీ డెబస్మిత సీహెచ్. బెనర్జీ ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే ప్రయాణికుల భద్రతతో పాటు వారు పోగొట్టుకున్న, విలువైన వస్తువులను వెతికి యజమానులకు అందజేయడంలో ఆర్పీఎఫ్ పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. 'ఆపరేషన్ అమానత్' పేరుతో ప్రయాణికులు పోగొట్టుకున్న, చోరీలకు గురైన వస్తువులను తిరిగి వారికి అప్పగిస్తున్నామని, ఈ సంవత్సరంలో ప్రయాణికులు పోగొట్టుకున్న లగేజ్ బ్యాగ్‌లు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్స్, బంగారు ఆభరణాలు వంటి సుమారు రూ. 1.40 కోట్లు విలువగల వస్తువులను రికవరీ చేసి అప్పగించామన్నారు.

కులగణనతోనే సామాజిక న్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: కుల గణనతోనే సామాజిక న్యాయం జరుగుతుందని ప్రొ.యోగేంద్ర యాదవ్ అన్నారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగంలో వామపక్ష, దళిత, బహుజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏ టాక్ ఆన్ వై డు వీ నీడ్ ఏ కాస్ట్ సెన్సెస్ అనే అంశంపై జరిగిన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రొ.చంద్రునాయక్ అధ్యక్షత వహించగా ప్రొ.యోగేంద్ర యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని జనగణనలో కులగణన ఆవశ్యకత గురించి వివరించారు. చలమల్ల వెంకటేశ్వర్లు, ప్రభంజన్‌యాదవ్, పరందాములు, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

పార్కును శుభ్రంగా ఉంచాలి

అమీర్‌పేట: సనత్‌నగర్ డివిజన్‌లోని కేఎల్‌ఎన్ మున్సిపల్ పార్కును జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రె మంగళవారం సందర్శించి నిర్వహణను పరిశీలించారు. ఉన్నతాధికారులు వస్తున్న సమయంలోనే వ్యర్థాలను తొలగిస్తున్నారని వాకర్స్ కమిషనర్ దృష్టికి తీసుకురావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచి ప్రతి రోజు పార్క్ లోపల ఊడ్చాలని ఆదేశించారు.పార్కు నిర్వహణ సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నామని వాకర్స్ చెప్పగా వినాయక చవితిలోపు అందుబాటులోకి వస్తాయని ఇంజనీరింగ్ విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్ వివరించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

రసూల్‌పురా: ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ ముఖ్యమని ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం ప్రొఫెసర్ ప్యాట్రిక్ పేర్కొన్నారు. మంగళవారం సికింద్రాబాద్ పీజీ కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో చేరిన నూతన విద్యార్థి విద్యార్థులకు నిర్వహించిన ఇండక్షన్ (ప్రేరణ) కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుంటూ మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన పెంపొందించుకుని ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని ప్రిన్సిపల్ అర్జున్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా. మృదుల, లక్కరాజు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళల ఆదాయం పెరగాలి



మహిళలతో మాట్లాడుతున్న ఆదిత్యరెడ్డి

సనత్‌నగర్: ఆడబిడ్డల ఆదాయం పెరిగి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే సంకల్పంతో స్కిల్ శక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎంసీఆర్ఎఫ్ చైర్మన్ మర్రి ఆదిత్యరెడ్డి అన్నారు. బేగంపేటలోని ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటూ కుటుంబం మొత్తం బాగుంటుందని తద్వారా దేశం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంబ్రాయిడరీ, ఈవీ, ఫ్యాషన్ డిజైనింగ్ లాంటి ఆధునిక అంశాలపై శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని భవిష్యత్‌లో ఇలాంటి శిక్షణా కేంద్రాలు అన్ని ప్రాంతాలకు విస్తరిస్తామన్నారు. శిక్షణ పొందుతున్న మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శైలేష్, కృష్ణా యాదవ్, షేక్ యాకూబ్, ఇలాస్, సిద్దిఖ్ ఖాన్, మహ్మద్ నజీర్ పాల్గొన్నారు. అనంతరం ఓల్డ్ కస్టమ్స్‌బస్తీలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఆయన ఉపాధ్యాయులు, సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.

ఉద్యోగాల పర్మనెంట్‌కు వీసీలు సహకరించాలి



ఆందోళన చేస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాల పర్మనెంట్‌కు రాష్ట్రంలోని 12 వర్సిటీల వీసీలు సహకరించాలని తెలంగాణ వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ చైర్మన్ డాక్టర్ పరుశురామ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కళాశాల ప్రవేశ ద్వారం ఎదుట మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రేమయ్య, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాప్ వాల్వ్ పద్ధతితో వరదలకు చెక్ పెట్టొచ్చు

సనత్‌నగర్: బేగంపేటలోని కూకట్‌పల్లి నాలా పక్కనే ఉన్న భగవంతపూర్, మయూరీమార్గ్, అల్లంతోటబావి లాంటి లోతట్టు ప్రాంతాలు వరద ముంపునకు గురికాకుండా ఫ్లాప్‌వాల్వ్‌ల ఏర్పాటే సరైన పరిష్కారమని మర్రి శశిధర్‌రెడ్డి సూచించారు. నాలాలో నీటిమట్టం పెరిగినప్పుడల్లా లోతట్టు ప్రాంతాలు రిటైనింగ్ వాల్ ద్వారా రక్షింపబడతాయని, స్థానికంగా కురిసే వర్షంతో ఓపెన్‌నాలా నీటిని లోపలికి ప్రవహించేలా చేస్తాయని ఇది వరదలకు దారి తీస్తుందన్నారు. ఇలాంటి నివాస ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ఫ్లాప్ వాల్వ్‌ను ఏర్పాటు చేయాలని గతంలో ఇంజనీరింగ్ సిబ్బందికి పలుమార్లు సూచించినా పట్టించుకోలేదని అన్నారు. అయితే ఇటీవల జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ ఈఎన్‌సీ జియావుద్దీన్‌తో సమావేశమై జీహెచ్ఎంసీ పరిధిల్లో నాలాల వెంట ఉండే బస్తీలను నీటి ముంపు నుంచి కాపాడేందుకు ఆర్థికంగా ఎక్కువ ఖర్చులేని ఈ పద్ధతిని సూచించినట్లు వెల్లడించారు. బ్రాహ్మణవాడిలో ఈ పద్ధతిని ఉపయోగిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు.

30న ఉమాంగ్ 2.0 జ్యువెలరీ, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్





బ్రోచర్ విడుదల చేసిన నటి వర్ష తదితరులు, మోడల్స్ ర్యాంప్‌వాక్

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో జీటో (జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో ఉమాంగ్ 2.0 జ్యువెలరీ, లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్టు జీటో చైర్మన్ సుశీల్ సంచేటి తెలిపారు. మగువల అందాలను రెట్టింపు చేసే జువెలరీ అందుబాటులో ఉంటుందన్నారు. సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లో కవి సమ్మేళన్, లీడర్‌షిప్ తదితరాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన బ్రోచర్ రిలీజ్ కార్యక్రమంలో జబర్దస్త్ నటి వర్షతో పాటు పలువురు మోడల్స్ పాల్గొన్నారు. అనంతరం ర్యాంప్ వాక్ చేశారు. కార్యక్రమంలో జీటో చీఫ్ సెక్రటరీ పరేశ్‌షా, ట్రెజరర్ బి.ఎల్ బండారీ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379